



24 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 24 తేదీ నుంచి జూన్ 3 తేదీ వరకు వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విజయనగరం జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో పొందుపరిచినట్లు వెల్లడించారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు అందరూ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి ప్రతి విద్యార్థికీ అందజేయాలని సూచించారు. విద్యార్థులంతా తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యే విధంగా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి కోరారు.

4 వరకూ ఉత్కంఠే

- ఆగని కూడికలు, తీసివేతలు
- నాడు ఓటర్ల చుట్టూ... నేడు గుళ్లూ గోపురాల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ, గెలుపోటములపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. కేవలం అభ్యర్థులు, పార్టీ నాయకుల్లోనే కాదు. ఆయా పార్టీల కార్యకర్తలతోపాటు సాధారణ ప్రజల్లోనూ ఇదే రకమైన చర్చ వినిపిస్తోంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. అదే రోజు ఫలితాలు కూడా వెలువడతాయి. విజయనగరం పార్లమెంటు స్థానంలో 15 మంది, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అరకు పార్లమెంట్ స్థానంలో 13 మంది, జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 77 మంది, మన్యం జిల్లా పరిధిలో 4 అసెంబ్లీ స్థానాలకు 31 మంది అభ్యర్థులు తమ జాతకాలను పరీక్షించుకోనున్నారు. ఈ తీర్పులో విజయనగరం జిల్లాలో 12,71,173 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 7,83,440 మంది ఓటర్లు భాగస్వామ్యం కానున్నారు. అభ్యర్థులంతా ఇప్పటికీ కూడికలు, తీసివేతలతో కుస్తీపడుతున్నారు. ఎన్ని లెక్కలు వేసుకున్నా ఆ రోజు వరకు వేచిచూడాల్సిందే. పోలింగ్ రోజు వరకు ఓటర్లే దేవుళ్లుగా భావించి వంగి వంగి నమస్కారాలు చేసిన అభ్యర్థులు, వారి తరపు ప్రచారకర్తలు నేడు గెలుపును ఆకాంక్షిస్తూ గుడులు, గోపురాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో అభ్యర్థులు భక్తిశ్రద్ధలతో ఆలయాలను సందర్శించి అనుగ్రహాన్ని కోరుకుంటున్నారు. కానీ, నిజరూపం ఓట్ల రూపంలో ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. ఆయా బాక్సులన్నీ జెఎన్‌టియు-జివి, జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కాలేజీలో భద్రంగా ఉన్నాయి. అభ్యర్థులు ఊహల పల్లకిలో ఊరేగుతున్నారు. అతినమ్మకంతో ఉన్నవారు విజయోత్సవాలకు కూడా సిద్ధమౌతున్నారు. కేవలం కూటమి, వైసిపి అభ్యర్థులే కాకుండా ఇతర పార్టీలు, స్వతంత్రంగా పోటీచేసిన అభ్యర్థులు కూడా ప్రజావిశ్వాసాన్ని పరీక్షించుకోనున్నారు.

కూటమి, వైసిపి అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కూడా జోరుగానే సాగుతున్నాయి. టిడిపి, జనసేన, వైసిపి అభ్యర్థులు ఎవరికి వారే ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఒకరి విజయంతో మరొకరి అపజయం అనివార్యమౌతుంది. ఈనేపథ్యంలో ఇప్పుడు ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు అదే స్థాయిలో ఓటమిని అంగీకరించే పరిస్థితి ఉంటుందా? లేక ప్రజలపై నిందలు, దాడులకు తెగించే అవకాశం ఉంటుందా? వేచిచూడాల్సిందే. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఎన్నికల వేడి చల్లారలేదు. వాస్తవానికి మన జిల్లాలో ఫలితాల సందర్భంలో అటువంటి సంఘటనలు జరిగిన దాఖలాలు పెద్దగా లేవు. ప్రస్తుతం రెండు జిల్లాల్లోనూ 144 సెక్షన్ అమల్లో ఉంది. కానీ, పోలింగ్ సందర్భంగా ఇతర జిల్లాల్లో జరిగిన అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

విత్తనాలు సిద్ధం చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలు సిద్ధం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుపవనాలు తొందరగా వచ్చే అవకాశం ఉందని, రైతులకు అవసరమైన విత్తనాలు అధికారులు సిద్ధం చేయాలని తెలిపారు. అన్ని పరిస్థితులకు తట్టుకునే 1001 రకం విత్తనాలను మళ్లీ రైతులకు అందించాలని కోరారు. ధాన్యం బకాయిలు రైతులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో నీటి వనరులు సద్వినియోగమయ్యేలా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, చిన్న నీటి వనరుల కింద కాలువల్లో పూడికలు తీసి సాగునీరు చివరి ఆయకట్టుకు అందించాలని డిమాండ్ చేశారు. గతేడాది ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, మామిడి, జీడి మామిడి పంట దిగుబడి లేకపోవడం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులకు, కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వాలని, భూ సమగ్ర సర్వేలో సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గోపాలం, బి.రాంబాబు, ఉపాధ్యక్షులు సిహెచ్.జగన్, ఆర్.సత్యం, ఆదినారాయణ, నారాయణరావు, బాపునాయుడు, ఈదుబిల్లి అప్పారావు, గేదెల శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

అనవసర నిందలు సరికాదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 16న తహశీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ల తరలింపు వద్దకు వెళ్లిన తమ నాయకులపై అనవసర నిందలు వేయడం సరికాదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. 16న జరిగిన సంఘటనకు సమాచార లోపమే కారణమని తెలిపారు. ఎమ్‌పి పోస్టల్ బ్యాలెట్ బాక్సులు కలెక్టరేట్‌కి తరలించే సమయంలో అక్కడికి వెళ్లగా, తహశీల్దార్ కార్యాలయంలో తాళాలు తెరుస్తామని చెప్పారని వివరించారు. దీంతో ఆ సమయంలో తమ నాయకులు కౌశిక్, మామిడి అప్పలనాయుడును తహశీల్దార్ కార్యాలయానికి పంపించినట్లు వివరణ ఇచ్చారు. తాళాలు తెరిచే సమయంలో తహశీల్దార్ కార్యాల యంలో తప్పు జరిగినట్లు టిడిపి నాయకులు ఆరోపణలు చేస్తున్నా రని, పార్టీ అభ్యర్థి, ఏజెంట్లు అందుబాటులో లేకపోతే పార్టీ నాయకులను పంపిస్తామని, దానివల్ల ఇబ్బంది ఏమీ లేదన్నారు. ఉద్యోగులు అధికార పార్టీకి వ్యతిరేకమంటున్నారు కాబట్టే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గల్లంతు చేసేందుకు చూస్తున్నారని ఆరోపించడం సరికాదన్నారు. గెలిచినా, ఓడినా హుందాగా ఉన్నామన్నారు. ఏ పదవి చేసినా.. దానికి న్యాయం చేశామని భావిస్తున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించినట్లు చెప్పారు. ప్రతిపక్ష పార్టీ కోరుకున్న విధంగానే కౌంటింగ్ సజావుగా సాగాలని తాము కోరుకుంటున్నామని, తహశీల్దార్ కార్యాలయంలో ఎటువంటి తప్పుడు పనులూ జరగలేదని స్పష్టంచేశారు. సమావేశంలో వైసిపి నాయకులు మామిడి అప్పలనాయుడు, జమ్ము శ్రీను, ఆశపు వేణు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోలగట్ల

జిందాల్ కార్మికులకు అండగా ఉంటాం


ఎంపిపి గోపమ్మ • నాలుగో రోజుకు నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కార్మికులకు అండగా ఉంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తవలస ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ భరోసానిచ్చారు. జిందాల్ కార్మికుల నిరసన సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఎంపిపి గోపమ్మ మాట్లాడుతూ అర్ధాంతరంగా లేఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు. అవసరమైతే జిందాల్ కార్మికుల సమస్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి, తద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

బేషరతుగా పరిశ్రమను తెరిపించాలి

జిందాల్ కర్మగారాన్ని యాజమాన్యం బేషరతుగా తెరిపించి, కార్మికులందరికీ పని కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపైకి నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లేఆఫ్ ప్రకటించడాన్ని తప్పుబట్టారు. కంపెనీ మూసివేసి నాలుగు రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయనగరం డిసిఎల్ వద్ద మంగళవారం చర్చలు జరగనున్నాయని, ఆ చర్చలు ఫలించే విధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, కొత్తవలస, తుమ్మికాపల్లి, అప్పన్నపాలెం సర్పంచులు మచ్చ ఎర్రయ్య రామస్వామి, విరోతి కొండలరావు, కోన దేవుడు, బొంతల వెంకటరావు, టిఎన్‌టియుసి నాయకుడు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపిపి గోపమ్మ

పేదల ఆశాజ్యోతి సుందరయ్య

ప్రజాశక్తి - బలిజిపేట

కమ్యూనిస్టు గాంధీ, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, పేదల ఆశాజ్యోతి అయిన పుచ్చలపల్లి సుందరయ్య బాటలో పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. సుందరయ్య 39 వర్ధంతి సభ మండలంలోని చెల్లింపేటలో సిపిఎం మండల నాయకులు గంట్యాడ బలరాం నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ సుందరయ్య తన చిన్నతనం నుండే పేదల కోసం పోరాడారని, తన గ్రామంలోనే మొట్టమొదట వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీలు, దళితుల సమస్యలపై పోరాడారని తెలిపారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరి సామ్రాజ్యవాదులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం తెలంగాణ సాయుధ పోరాటం చేశారన్నారు. దీనికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. 10వేల గ్రామాలను నైజాం నవాబ్, రజాకార్లు, జమీందారుల నుండి విముక్తి చేశారని అన్నారు. సుందరయ్య ఎమ్మెల్యేగా, ఎంపీగా సాధారణ జీవితం గడిపారని, పార్లమెంటుకు సైకిల్ మీద వెళ్లే వారిని అన్నారు. ఆయన స్ఫూర్తితో మనం కూడా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సుందరయ్య నాయకత్వంలో పోరాడి సాధించుకున్న హక్కులను కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం హరించి వేస్తుందని, మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే మొత్తం రాజ్యాంగాన్ని మారుస్తానంటుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చడమంటే రిజర్వేషన్లు ఎత్తివేయడమేనన్నారు. గిరిజన, దళిత, కార్మిక, రైతు చట్టాలను మార్చి వేయడమేనన్నారు. వీటికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో సుందరయ్య స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గౌరి, జ్యోతి, లక్ష్మం నాయుడు, పారినాయుడు, విశ్వేశ్వరరావు, రామారావు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

మాట నిలబెట్టుకున్న జగన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఒకే ఒక్క నాయకుడు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వివిధ సంక్షేమ లబ్ధిదారులకు సుమారు రూ.10 వేల కోట్లు అందిస్తే సిఎం జగన్‌కు ప్రజల్లో మరింత ప్రజాదరణ పెరిగి, ఓట్లు వేస్తారన్న అక్కసుతో కొంతమంది కుట్రదారులు పన్నాగం పన్నారని ధ్వజమెత్తారు. ముందే జమ కావాల్సిన డబ్బులపై కోర్టులకు వెళ్లడం, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడం ద్వారా నిలుపుదల చేయించారని విమర్శించారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి జగన్ ముందు నుంచీ ఇస్తున్న పథకాలను నిలుపుదల చేయవద్దని కోర్ట్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇప్పించారని చెప్పారు. ప్రస్తుతం ఆ నిధులను ప్రజల ఖాతాలలో జమ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆసరా కింద పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్లను గతంలో రాని మహిళలంతా నాలుగైదు రోజుల్లో తీసుకునే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇబిసి నేస్తం కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న అర్హత ఉన్న ఒసి మహిళల ఖాతాల్లో సోమవారం నుంచి జమవుతాయని వెల్లడించారు. విద్యాదీవెన నిధులు తల్లుల ఖాతాలలో, రైతులకు ఇన్ ఫుట్ సబ్సిడీ నిధులు జమైనట్లు చెప్పారు. నాలుగో విడత చేయూత పథకానికి సంబంధించి రూ.18,750 చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు. కొంతమంది ఎన్ని కుట్రలు పన్నినా బెదరకుండా సిఎం జగన్ చెప్పిన మాట ప్రకారం నిధులు జమ చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాదు.., ఎన్నికైన మరుసటి రోజు నుంచే ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించేది వైసిపి మాత్రమేనని పేర్కొన్నారు.

సంగీతం నేర్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులకు సంగీతం పట్ల అవగాహన కల్పిస్తే వారు దాంతోపాటు పాఠాలను కూడా అంతే శ్రద్ధతో నేర్చుకోగలరని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. సోమవారం విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంతోపాటు షణ్ముఖ ప్రియ ఆధ్వర్యంలో సంగీతంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం కార్యదర్శి బి.లక్ష్మి వేసవి విజ్ఞాన శిబిరానికి వచ్చిన పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లోని మదర్ థెరీసా కిడ్స్ స్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా వచ్చి, రక్తదానం చేయాలని కోరారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న డిఆర్ఒ కేశవనాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 7 వరకు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు అన్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాతావరణశాఖ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించినందున వర్షం వల్ల ఇబ్బందులు రాకుండా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 17 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు - తాగు నీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు రెండు పూటలా జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం వారికి ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ రెండో సంత్సరం వారికి మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

తదనుగుణంగా బస్సులు నడపాలని ఆయన చెప్పారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి డి.మంజుల వీణ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌టిసి, పోస్టల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిశువుల భవిష్యత్తు నాశనం చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వారం రోజుల్లో ముగ్గురు శిశువులను కాలువల్లో, చెత్త కుండీల్లో వేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయడం చాలా దురదృష్టకరమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత కొన్ని ప్రత్యేక పరిస్థితులు, దురలవాట్లు, చెడు స్నేహాల వల్ల గర్భం దాల్చి, జన్మనిచ్చిన శిశువును తమ నుంచి దూరం చేసుకోవడానికో, వదిలించుకో దారుణంగా నిర్మానుష్య ప్రదేశాలు, కాలువల్లో, పొదల్లో, చెత్త కుండీల్లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరికైనా పిల్లల పెంపకం, పోషణ, సంరక్షణ కోసం ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే అటువంటి శిశువులను, బాలలను ప్రభుత్వ నిబంధనల మేరకు తీసుకొని, వారికి బంగారు భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. అటువంటి శిశువుల కోసం జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో ఊయలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ ఊయలలో ఇటువంటి శిశువులను వేస్తే వారిని ప్రభుత్వాధికారులు బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంచి దత్తత ఇస్తారని తెలిపారు. వదిలి వేసిన వారి వివరాలను కూడా గోప్యంగా ఉంచుతారని వెల్లడించారు. రాష్ట్రంలో వేల కుటుంబాల్లో పిల్లలు లేక దత్తత కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారనీ, వారికి ఈ పిల్లలను దత్తత ఇచ్చి సహాయం చేసిన వారవుతామని తెలిపారు. ఈ సంఘటనల నేపథ్యంలో స్థానికంగా ఉండే అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది... గర్భిణులపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జరిగిన సంఘటనలపై పోలీసు అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపారు.

లోలోపల భయం... పైపైకి గాంభీర్యం

కూడికలు, తీసివేతల్లో ప్రధాన పార్టీల నేతలు • గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - కురుపాం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసి వారం రోజులైంది. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్ లోని ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. కౌంటింగ్‌కు మరో 15 రోజుల గడువు ఉండనే ఉంది. ఈలోగా పోటీలో అభ్యర్థులు, వారిని బలపరిచిన పార్టీశ్రేణులు, అభిమానులు ఎవరికి వారే పోలింగ్ సరళిని సమీక్షిస్తూ గెలుపు అంచనాలపై లెక్కలు వేసుకుంటున్నారు. లోలోప గుబులు ఉన్నా, పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 78.54 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 77.8 శాతం నమోదైంది. గతం కంటే ప్రస్తుతం 1 శాతం పెరిగింది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు లక్షా 94 వేల 114 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 54 వేల 450 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళలే ఎక్కువ మంది ఓటేశారు. గతం కంటే అధికంగా పోలింగ్ నమోదు కావడం, ముఖ్యంగా మహిళా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం అది తమ విజయానికి సంకేతమని అటు వైసిపి, ఇటు టిడిపి ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

సంక్షేమ పథకాలపై వైసిపి విశ్వాసం

నియోజక వర్గంలో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదు కావడం, అందులోనూ మహిళా ఓటర్లు పెద్దసంఖ్యలో ఓట్లేయడంతో వైసిపిపై గెలుపుపై ఆశలు పెంచాయి. నవరత్న పథకాలను ఎక్కువగా మహిళా లబ్దిదారుల పేరునే ఇవ్వడంతో వారంతా తమకే ఓటు వేసి ఉంటారన్న వైసిపి గట్టినమ్మకంతో ఉంది. అమ్మఒడి, చేయూత, కాపు నేస్తం, ఇబిసి నేస్తం, డ్వాక్రా సున్నా వడ్డీ, జగనన్న ఇళ్లు, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, విద్యా, వసతిదీవెన వంటి సంక్షేమ పథకాలు తమకు ఓట్లు తెచ్చి పెడతాయని అధికార వైసిపి నేతలు, గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలు లెక్కలు వేస్తున్నారు. 2024 మ్యానిఫెస్టోతో యువతలో కొత్త ఆశలు చిగురించాయని, కొత్తగా ఓటు వేసిన వారంతా తమ వెన్నంటే ఉన్నారని అంటున్నారు.



సూపర్ సిక్స్ పథకాలపై గంపెడాశలో టిడిపి ...

ఓటింగ్ సరళి చూస్తే ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగా ఉన్నట్టు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలు తమను గెలిపిస్తాయని టిడిపితో సహా కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. ఏటా మూడు ఉచిత వంట గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచితంగా ఆర్‌టిసి బస్సు ప్రయాణం, 18 ఏళ్ల నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1500 వంటి పథకాలను మహిళలు స్వాగతించారని, కూటమి పార్టీలకే ఓటేశారనడానికి పోలింగ్ సరళి తేటతెల్లం చేస్తుందని అంటున్నారు. యువతకు నెలసరి నిరుద్యోగభృతి రూ.3వేలు, 20లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వంటివి యువతను ఆకర్షించి, కూటమికి ఓట్లేసేలా చేశాయని లెక్కలు వేస్తున్నారు. రైతులకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం గ్రామీణ ప్రాంతంలో రైతుకుటుంబాలు ఓట్లేసేలా చేసిందని, ఇక ప్రతి విద్యార్థికి రూ.20వేలు విద్యాసాయం అందరినీ మెచ్చేలా చేసిందని టిడిపి వర్గాలు భావిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా రాత్రి వేళల్లోనూ క్యూలైన్లలో నిల్చోబెట్టి కూటమికి ఓట్లు తెచ్చిపెట్టిందని అంటున్నారు. ఇలా ప్రధాన పార్టీలు రెండూ ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నాయి.

బెట్టింగ్ కాస్తే చర్యలు : డిఎస్‌పి

తెర్లాం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు ఓటములపై బెట్టింగులు కాచేవారిపై చర్యలు తప్పవని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల తరువాత గ్రామాల్లో సామరస్యమైన వాతావరణానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వేపాడ: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ నిర్మల అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 19 పంచాయతీ కార్యదర్శులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఇఒపిఆర్‌డి ఉమా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామాలలో చేపట్టిన పారిశుధ్య పనుల వివరాలను తెలియజేయాలన్నారు. వల్లంపూడి గ్రామపంచాయతీలో పారిశుధ్య లోపంపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనంపై పంచాయతీ కార్యదర్శిని గ్రామ సర్పంచ్‌ని పిలిపించి రెండు మూడు రోజుల్లో ప్రధాన సిసి రోడ్లకు ఇరువైపులా ఉన్న పేరుకుపోయిన పూడికను చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రంథాలయం పట్ల నిర్లక్ష్యం వీడాలి

బొబ్బిలి: స్థానిక గ్రంథాలయం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు అకుల దామోదర్ డిమాండ్ చేశారు. గ్రంథాలయం అద్దె భవనాన్ని, పాతభవనాన్ని సోమవారం పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులు, యువకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు జ్ఞానాన్ని అందించే గ్రంథాలయం పట్ల ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. గ్రంథాలయ భవనాన్ని బాగు చేసేందుకు మున్సిపల్ నిధులు కేటాయించినప్పటికీ ఎందుకు పనుల్లో జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రంథాలయ భవనాన్ని బాగు చేయాలని లేదా స్థలం కేటాయించి నూతన భవనాన్ని నిర్మించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో సమాచార హక్కు చట్టం ప్రజా సంఘాల వేదిక సభ్యులు సురేష్ ఉన్నారు.

అశోక్‌ను కలిసిన కోళ్ల

శృంగవరపుకోట: ఎస్‌కోట నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి దంపతులు సోమవారం మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజుని, విజయనగరం కూటమి అభ్యర్థి అదితి గజపతి రాజుని కోటలో మర్యాద పూర్వకంగా కలిసి ఈ నెల 13న జరిగిన ఎన్నికల సరళి పై వివరించారు. రాష్ట్ర ప్రజలకు ఇక అన్ని మంచి రోజులేనని తాను విశాఖ ఎంపి అభ్యర్థి శ్రీ భరత్ భారీ మెజారిటీతో గెలుస్తామని చెప్పారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ముచ్చటించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

విజయనగరం: సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం ఉచిత కిడ్నీ, లేపరోస్కోపిక్ లేజర్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎ. శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్ రవికుమార్ రాజు, కట్టమూరి సింధూరి, సర్జికల్ పాల్గొని వైద్యం అందిస్తారన్నారు. శిబిరాన్ని వినియోగించుకున్న వారికి అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్‌తో పాటు మూడు రోజులు పాటు సరిపడే మందులను ఉచితంగా ఇస్తామన్నారు. జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

బొబ్బిలి: జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం నందమూరి అభిమానులు పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఆహార పొట్లాలు పంపిణీ చేయడంలో ఎంతో ఆనందంగా ఉందని నందమూరి అభిమానులు పి.శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాల కొనుగోలు

రామభద్రపురం: రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని ఎఒ వెంకయ్య కోరారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దళారీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు విధిగా రశీదులు కూడా పొందాలని తెలిపారు. గడ్డి పిక్క పత్తి విత్తనాలు సాగుచేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఆ రకమైన విత్తనాలు సాగుచేస్తే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. బీటీ-2 విత్తనాలు మాత్రమే సాగుచేయాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 750 క్వింటాళ్ల వరి విత్తనాలు తెప్పించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

భోగాపురం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఉప్పాడ అనుషరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎన్నికల కోడ్ ఉండడంతో ఎటువంటి చర్చలూ, తీర్మానాలు లేకుండానే ముగించారు. ఎంపిడిఒ చంద్రకళ, వైస్ ఎంపిపి రావాడ బాబు, పడాల సత్యవతి, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. రమేష్ కుమార్ చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023- 24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తయిన నలుగురు విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఒకేషనల్ కోర్సులతోపాటు ఇంటర్ షిప్ చేయడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇంటర్షిప్ విజయవంతంగా విద్యార్థులు పూర్తి చేయడానికి సహకరించిన సమగ్ర శిక్ష అభియాన్, లెర్న్ స్కిల్స్ సంస్థలతోపాటు, కంప్యూటర్ ఉపాధ్యాయుడు కార్తీక్‌ని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ డి .వెంకటరమణ, కంప్యూటర్ టీచర్ కార్తీక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ప్రార్థన దినం



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ శేఖర్‌బాబు

కొత్తవలస: కొత్తవలసలో ప్రపంచ ప్రార్థన దినం ఘనంగా జరిగింది. స్థానిక బాపిస్ట్ చర్చిలో కొత్తవలస పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్, కొత్తవలస బాప్టిస్ట్ చర్చిల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రపంచ శాంతి కోసం, సమాధానం కోసం ఐక్యత ప్రేమతో ప్రపంచం వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. రెవ.వి. శేఖర్ బాబు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో కెపియఫ్ఎ ప్రెసిడెంట్ రెవ.యమ్.జాన్‌కుమార్, జనరల్ సెక్రటరీ రెవ.ఎస్. చంద్ర శేఖర్ ట్రెజరర్ రెవ.బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే గుణాత్మక విద్య

రామభద్రపురం: ప్రభుత్వ కళాశాలల్లోనే గుణాత్మక విద్య సాధ్యమవుతుందని ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఈ ఏడాది కొత్తగా మంజూరైన ఇంటర్మీడియేట్‌కు విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్లో ఈ నూతన కళాశాలను ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మొదటిగా ఎంపిసి, సిఇసి గ్రూపులు ఏర్పాటు చేస్తున్నామని, ఒకొక్కక గ్రూపునకు 40మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని చెప్పారు. జూనియర్ కళాశాలలేని పెద్ద హైస్కూల్లో హైస్కూల్ ప్లస్ పేరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేశారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి ఇంటర్ కళాశాల మంజూరైందన్నారు. ఇటీవల పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలని కోరారు. దీనికోసం ఆయా గ్రామాల జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ కళాశాలలో చేర్పించాలని కోరారు.

గంజాయితో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని రంగపువలస చెరువు గట్టు దగ్గర 2.195 కేజీల గంజాయితో పలు గ్రామాల నుంచి ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఒరిస్సా బోర్డర్ సుంకి నుంచి దిగుమతి చేసి చిన్నచిన్న పొట్లాలుగా పార్సెల్ చేసి విక్రయిస్తున్నట్లు బొబ్బిలి సిఐ తిరుమలరావు తెలిపారు. తెర్లాం ఎస్ఐ ఆర్ రమేష్ వీరుని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి విచ్చలవిడిగా దొరకడం ఆశ్చర్యానికి గురిచేసిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఒక పక్క పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తుండగానే మరో పక్క గంజాయి విచ్చలవిడిగా దొరకడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆట..భవిష్యత్తుకు బాట

ప్రజాశక్తి- చీపురుపల్లి

క్రీడ మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యకరంగా ఉంచుతుంది. ఆడపిల్ల అయినా మగ పిల్లాడైనా క్రీడలను ఆస్వాదించడం ఎంతో మేలు. గెలుపు ఓటములు ముఖ్యం కాదు పిల్లల్ని ఫిట్ గానూ, ఆరోగ్యవంతంగా తయారు చేయడానికి క్రీడలు తోడ్పడతాయి. ఆటలాడితే ఆరోగ్యకరమైన మనస్సుతో పిల్లలు ఉత్సాహంగా ఉంటారు. ఈ క్రమంలోనే చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరానికి మంచి స్పందన లభిస్తోంది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు అనవసరమైన తిరుగుళ్లు తిరగకుండా ఉండేందుకు పాఠశాల పిఇటి స్వరూప్, కె మురళీధర్ ఆధ్వర్యంలో పిల్లలకు క్రీడలలో మంచి తర్ఫీదు ఇస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా శిబిరంలో చదువుకుంటున్న చిన్నారులు ఆటలతో పాటు కొత్త విషయ పరిజ్ఞానంతో కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. ఆటలు వల్ల ఆరోగ్యంతో పాటు విజ్ఞానం పెరిగి ఉన్నత లక్షణాలను అలవరుచుకుంటున్నారు. పిల్లలో దాగి ఉండే సృజనాత్మకతను వెలికి తీసి ఉత్తమంగా తీర్చిదిద్దడంలో శిక్షకులు కీలక పాత్ర పోషిస్తున్నారు.



క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న అశ్విని

ఉదయం, సాయంత్రం శిక్షణ

మే1 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణా శిభిరం మే నెలాఖరు వరకు సాగుతుంది. ఈ శిక్షణా శిభిరంలో సుమారు వంద మంది వరకు పిల్లలు వివిధ ఆటలలో శిక్షణ పొందుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణను అందిస్తున్నారు. ఈ శిబిరంలో బాలురు, బాలికలు కూడా శిక్షణ పొందుతున్నారు. ప్రధానంగా కబడ్డి, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాట్‌మెంటిన్, అథ్లెటిక్స్ వంటి ఆటలలో శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమికంగా ఆటలో నియమ నిబంధనలు, మెలుకవలు, బంతిని పాసింగ్ చేయడం, డ్రిబ్లింగ్ చేయడం వంటి వాటిపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు.

జీవితంలో ఎదగడానికి ఇదొక పునాది



ఒక్క పైసా ఖర్చు లేకుండా శిక్షణను ఇస్తున్నారు. దీని వల్ల తల్లిదండ్రుల మీద ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఉచితంగా శిక్షణ పొందుతున్నాను. జీవితంలో ఒక స్థాయికి ఎదగడానికి ఈ శిక్షణా శిభిరం తోడ్పాటవుతుంది. కబడ్డీపై పూర్తి అవగాహనతోపాటు పలు రకాలైన నైపుణ్యాలపై పట్టు సాధిస్తున్నాను. వేసవి సెలవుల్లో ఇదో మంచి అవకాశంగా భావిస్తున్నాను.

లాస్య, పదో తరగతి విద్యార్థిని, చీపురుపల్లి

క్రికెట్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే నా లక్ష్యం

క్రికెట్ ఆటలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే నా లక్ష్యం. అందుకే ఇక్కడ ఏర్పాటు చేసిన శిక్షణ శిభిరంలో పాల్గొని శిక్షణ పొందుతున్నాను. క్రికెట్‌లో మెలకవులతో పాటు నైపుణ్యం పైన అవగాహన పొందుతున్నాను. శిక్షణా శిభిరం నా భవిష్యత్‌కి ఉపయోగ పడుతుందని భావిస్తున్నాను.

అశ్విని, ఏడవ తరగతి విద్యార్థిని

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే..

బాల్యం నుంచే విద్యార్థులకు ఆటల పట్ల అవగాహన ఉండాలి. అందుకోసం తల్లి దండ్రులు కూడా విద్యార్థులను ప్రోత్సాహించాలి. ఏటా చాలా మంది పిల్లలకు వేసవి శిక్షణా శిభిరాల్లో శిక్షణను అందిస్తున్నాం. వేసవి శిభిరానికి వచ్చిన వారిలో వారియొక్క నైపుణ్యాన్ని గుర్తించి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం. వారి నైపుణ్యాన్ని బట్టి వారిని ఆయా ఆటలవైపు వెళ్లేందుకు శిక్షణను అందిస్తున్నాం. వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే విదంగా వారిని తీర్చిదిద్దడమే మా లక్ష్యంగా పనిచేస్తున్నాం. శిక్షణా శిబిరాల ద్వారా శిక్షణ పొందిన చాలా మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలలో పాల్గొంటున్నారు. ఆటలతో పాటు వారికి నాయకత్వ లక్షణాలు పెంపొందుతున్నాయి.



కబడ్డీ ఆడుతున్న బాలికలు



పిఇటి స్వరూప్


ఘనంగా తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి

గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి సరే పొలమ్మతల్లి గ్రామదేవత పండగ సందర్భంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పాతబొబ్బిలి, బొబ్బిలి, లచ్చయ్యపేట గ్రామాల్లో సరే పొలమ్మతల్లి, గొల్లపల్లి, కృష్ణాపురం, బొబ్బిలి, అప్పయ్య పేట, రంగరాయపురం, గున్నతోటవలస, ఇందిరమ్మ కాలనీ, ఐటిఐ కాలనీలో దాడితల్లి అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. గొల్లపల్లి, పాతబొబ్బిలిలో బల్ల వేషాలు వేసి గ్రామంలో ఊరేగించారు.

సిరిమానోత్సవాలకు ఆటంకం కలగకుండా చర్యలు

గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపొలమ్మతల్లి గ్రామదేవత పండగల సిరిమానోత్సవాలకు ఎటువంటి ఆటంకమూ కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని సిరిమానోత్సవం జరిగే ప్రాంతాల్లో సోమవారం ఆమె పరిశీలించారు. సిరిమానోత్సవానికి ఇబ్బందులు లేకుండా రోడ్లుపై ఉన్న వ్యర్థాలు, నిర్మాణ సామగ్రిని తొలగించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలని, రోడ్లు శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



బిందెల నృత్యం చేస్తున్న కళాకారులు

దుస్తులు పంపిణీ

శ్రీదాడితల్లి, సరేపొలమ్మతల్లి గ్రామ దేవత పండగలు సందర్భంగా బ్రహ్మ కుమారులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 200 మందికి దుస్తులు పంపిణీ చేసినట్లు బ్రహ్మ కుమారి రాజేశ్వరీ చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

మనబడి, నాడు- నేడులో జరుగుతున్న పాఠశాలల నిర్మాణ పనులను జూన్ 12 నాటికి పూర్తి చేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎంఇఒ వరప్రసాదరావు, ఎరకయ్య అన్నారు. ఈ మేరకు సోమవార ఎంపిడిఒ కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. రెండు, మూడు విడతలలో మంజూరైన పాఠశాలల నిర్మాణాలు జూన్ 12 నాటికి ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా శత శాతం పనులు పూర్తి చేయాలని సూచించారు. చాలావరకు రివాల్వింగ్ ఫండ్ కొరత సిపిఎం మెటీరియల్ చేరకపోవడంపై పనులు జరగడంలేదని ప్రధానోపాధ్యాయులు ఎంపిడిఒకు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండి, పనులు శత శాతం అయ్యేలా చూడాలని ఆదేశించారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి కోరారు. స్థానిక సబ్ జైలును సోమవారం పరిశీలించారు. వంట గదిని పరిశీలించి భోజనాలు నాణ్యతపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఖైదీలతో స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. తెలిసి తెలియక చేసిన తప్పులను తెలుసుకుని మంచి ప్రవర్తనతో నడవాలని కోరారు. సత్ప్రవర్తన మంచి భవిష్యత్తు ఇస్తుందన్నారు. ఆయనతో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ అధికారి విజయ కళ్యాణి ఉన్నారు.

వికలాంగ పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో గల పూర్వ ప్రాథమిక, బడి ఈడు వికలాంగ పిల్లలను గుర్తించాలని మండల విద్యాశాఖాధికారులు కె.మోహనరావు, యువిఎస్‌పి శివాజీ వర్మ కోరారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ - సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మెంటాడ, జీరికివలస, వెంకంపేట, కంటుభుక్తవలస గ్రామాల్లో బడి ఈడు, బడి బయట గల వికలాంగ పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాలలోని పలువురు తల్లీదండ్రులతో మాట్లాడుతూ వికలాంగ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పాఠశాలలో ఈ చిన్నారులు విద్యను అభ్యసించడానికి వారికి అనుగుణమైన డిజిటల్ విద్యతో పాటు రైలింగ్ ర్యాంపులు, ఫ్రెండ్లీ టాయిలెట్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. వివిధ రకాల ఉపకరణాలు, ఉపకారవేతనాలు, ట్రై సైకిళ్లు అందజేస్తు న్నట్లు చెప్పారు. మండలం కేంద్రంలో వికలాంగ పిల్లల కోసం భవిత కేంద్రం నిర్వహిస్తున్నామని, ఇక్కడ ఈ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులు ఉంటారని చెప్పారు. ప్రతి మంగళవారం భవిత కేంద్రంలో శారీరక వైకల్యాలు ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ కార్యక్రమం జరుగుతుందన్నారు. వికలాంగ పిల్లలకు అందుతున్న ఈ సేవలను తల్లీదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఆర్. చంద్రరావు, ఎస్. పద్మజ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో సర్వే చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ఎన్నికల విధుల పత్రాలను జారీ చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని విధులు నిర్వర్తించిన పిఒ, ఎపిఒ, ఒపిఒలకు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికేట్లు జారీ చేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజుతో పాటు ఫెడరేషన్ నాయకులు ప్రవీణ్, ఎల్లయ్య, లక్ష్మణరావు, రామ కృష్ణలు సోమవారం ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి ఏ సాయిశ్రీని ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రాన్ని అందించారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ జరి చేసారని ఆమెకు తెలియచేస్తూ పిఒ, ఎపిఒలకు 3 రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు 2 రోజుల ఎన్నికల విధులకు మొత్తం 5 రోజులకు, ఒపిఒలకు రెండు రోజులకు రెమ్యునరేషన్ తీసుకున్న రిజర్వడ్ సిబ్బందికి కూడా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్స్ జారీ చేయాలని కోరారు. ఆర్‌డిఒ స్పందిస్తూ హోమ్ ఓటింగ్, పోస్టల్ బేలెట్ విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్స్ ఇచ్చామని ఎన్నికలు విధుల్లో పాల్గొన్న నాన్ వెకేషన్ సిబ్బందికి కూడా రెండు మూడు రోజుల్లో విధుల ధ్రువ పత్రాలను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సహాయక రిటర్నింగ్ అధికారి, బొబ్బిలి తహశీల్దార్ త్రినాథరావు నాయుడుకు ఆదేశాలు జారీ చేశారు. అందరికి ఒకేసారి జారీ చేసి పిడిఎఫ్‌లో పంపిస్తామని సంబంధిత ఉపాధ్యాయులు వాటిని తీసుకోవచ్చని ఆమె తెలిపారు.

ఆర్‌ఒకు ఎపిటిఎఫ్ వినతి



ఆర్‌డిఒకు వినతినిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

బోధనలో విలువలు జోడించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో అనిట్స్ (అనీల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) ఉమ్మడి పరిశోధనలు జరిపేందుకు ముందుకు వచ్చింది. సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పరిశోధన, ప్రచురణలు కీలకపాత్ర వహిస్తాయ న్నారు. అధ్యాపకులు ఏటా తమ బోధనలో 40 శాతం విలువలు జోడించి బోధనలు చేయాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలకు నైపుణ్యం ఉన్నవారు అవసరమని డిగ్రీలు ప్రధానం కాదన్నారు. ఈ సందర్భంగా అనిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.రామకృష్ణ మాట్లాడుతూ వినూత్న బోధన, పాఠ్య ప్రణాళిక రూపకల్పన ముఖ్యమని అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఎప్పటికపుడు నూతన విజ్ఞానాన్ని అందిపు చ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనిట్స్ అధ్యాపక సిబ్బందితో పాటు సెంచూరియన్ అధ్యాపక సిబ్బంది డీన్ డాక్టర్ సన్నీడియోల్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ప్రొఫెసర్ శాంతమ్మ, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ మురళీ, డీన్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ విజయ్‌బాబు, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తెనాలి రామకృష్ణుడు కథలు, బేతాళ కథలు, ఆపదలో పడిన కుందేలు కథలు గురించి విద్యార్థులచే చదివించారు. బాగా చదివిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం హై స్కూలు ఉపాధ్యాయులు కె విస్సు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించి గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. దీనికి ముందు మూడు గ్రూపులుగా విద్యార్థులను విభజించి ఒక్కొక్క గ్రూపునకు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, దేశ నాయకులు గురించి బోధించి అనంతరం వాటిపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి వేసవి శిబిరం ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేస విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ టీచర్ అంబటి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగంలో మెలకువలు నేర్పించామని గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నీతి కథలు చదివించామని ఈ కార్యక్రమంలో మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

తొలిసారి వెన్ను వైకల్య శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో తొలిసారిగా వెన్ను వైకల్యం శస్త్ర చికిత్స జరిగింది. సోమవారం మిమ్స్ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె. వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏ. జ్యోతి అనే 33 సంవత్సరాల మహిళ తన పుట్టుక నుండి ఉన్న వెన్ను వైకల్యం/గూని నెగ్లెటెడ్ కంజెన్షియల్ లంబర్ కైఫాస్కోలియోసిస్ కారణంగా వెన్ను నొప్పి, రెండు కాళ్ల నొప్పి, తిమ్మిర్లతో చాలా ఇబ్బంది పడేవారు. దీంతో బాధితురాలు మిమ్స్ హాస్పిటల్ సంప్రదించింది. ఈ నేపథ్యంలో ఆర్థోపెటిక్ విభాగం వైద్యులు, ఎనస్థిసియా వైద్యులు ఆధ్వర్యంలో సుమారు 6 గంటలపాటు జరిగిన క్లిష్టమైన అరుదైన శస్త్ర చికిత్సతో వెన్ను వైకల్యాన్ని సరిచేసి వెన్ను వంకర తొలగించారు. ఇటువంటి శస్త్రచికిత్స విజయనగరం జిల్లాలో మొదటిసారిగా మిమ్స్ హాస్పటల్లో జరిగినట్లు వెల్లడించారు. ప్రస్తుతం శస్త్ర చికిత్స జరిగిన జ్యోతి తన రోజువారి పనులు ఇబ్బందులు లేకుండా చేసుకుంటున్నారు. శస్త్ర చికిత్సలో డాక్టర్ శశి భూషణ్, డాక్టర్ యశ్వంత్, యునిట్ ఇంఛార్జిలు డాక్టర్ విజయ్ భూషణ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సతీష్, డాక్టర్ ప్రదీప్, ఎముకల స్పెషలిస్ట్ బృందం, మత్తు వైద్య బృందం పాల్గొన్నారు.



చంపావతిలో తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నదుల్లో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరపరాదని మైనింగ్ విజిలెన్స్ ఎడి బి.విజయలక్ష్మీ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక రామతీర్థం జంక్షన్ చంపావతి నదిలో ఇసుక తవ్వకాల జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నదుల్లో ఎటువంటి అనుమతులూ లేకుండా ఇసుక తవ్వకాలు జరపరాదన్నారు. నదుల్లో ఇసుక అక్రమంగా తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. ఇసుక తవ్వకాల వల్ల తాగునీటి పథకాలకు ముప్పు ఏర్పడుతుందని, గుంతలు ఏర్పడి మనుషులు, జంతువులు అందులోపడి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలోమైనింగ్, ఎస్ ఈబి బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతే కాని పట్టించుకోరా?

- అధికారుల తీరుపై ప్రజాగ్రహం
- రాత్రంతా కాపలా కాసిన యువత
- మళ్లీ పులిని చూశామంటున్న దిబ్బలపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి - భోగాపురం

'ప్రాణాలు పోతేకాని చిరుత పులిని నుంచి మమ్మల్ని రక్షించరా' అంటు వివిధ గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. చిరుత పులిని చూశామని గ్రామస్తులందరు చెబుతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి కూడా ఇక్కడ ఏంజరుగుతుందో కూడా పట్టించుకోని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో భయాందోళనలు చెందుతున్నప్పటికీ అది పులి అవునా కాదా అనేది కూడా తేల్చి చెప్పడంలేదని వాపోతున్నారు. తాజాగా ఆదివారం రాత్రి దిబ్బలపాలెంకు చెందిన కొంత మంది యువకులు పులిని చూసి పరుగులు తీశారు. అనంతరం గ్రామంలో చెప్పడంతో వారంతా కర్రలు పట్టుకొని సమీపంలోని రిసార్ట్‌లో తిరగారు. గ్రామంలోకి రాకుండా ఉండేందుకు లైట్లు పట్టుకొని కాపలా కాశారు. అయితే రిసార్ట్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న గారి రమణ అనే వ్యక్తి కూడా చూసి పరుగులు తీశానని అంటున్నాడు. అటవీశాఖ అధికారుల తీరు దారుణంగా ఉందని అంటున్నారు. దిబ్బలపాలెం పాఠశాల పైన వాటర్ ట్యాంకు ఉందని అక్కడ కిందన నీరు నిలిచి ఉంటుందని ఆ నీరును తాగేందుకు వస్తుందని అంటున్నారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



రాత్రిపూట కాపలా కాస్తున్న యువకులు